# కాలుష్యం

గదిలోకి పొగ వచ్చి భారతిని ఉక్కిరి బిక్కిరి చేసింది. దగ్గు తెరలు తెరలుగా వచ్చింది.

చదువుతున్న పుస్తకం పక్కనపెట్టి వీధిలోకి ఉన్న గది తలుపు మూయడానికి వచ్చింది. ఎదురుగా రోడ్డు మీద ఉన్న చెత్తకుండీలో ఎవరో నిప్పులు విసిరేసినట్లున్నారు. చెత్త అంటుకుని మండుతున్నది. నీలంపొగ మేఘాలు సృష్టిస్తున్నది.

పొల్యూషన్!

వాతావరణ కాలుష్యం !

ఈ మనుషులకస్సలు బుద్ధి ఎలా లేకుండా పోతున్నదో! ఇలా ఎక్కడబడితే అక్కడ మంటలు పెడితే విషవాయువులు విజృంభించి వాతావరణాన్ని అల్లకల్లోలం చెయ్యవు!

"భామా! ఎక్కడ చచ్చావే!" వంటింట్లోంచి తల్లి అనసూయ కేక పెట్టింది. ఆమెకు అంతకంటే మృదువుగా మాట్లాడ్డం చేతకాదు.

"వస్తున్నానమ్మా! ఏం కావాలి." విసుగు అణచిపెట్టుకుంటూ చెప్పింది. కాని ఖంగారులో చదువుతున్న నవలని అలాగే పట్టుకొచ్చేసింది. తరువాత తన తప్ప తెల్సుకుని చీరమడతల్లో దాచడానికి ప్రయత్నించింది.

కాని అనసూయమ్మ దృష్టిలో పడనే పడింది అది. "ఊ ! ఏం చదువుతున్నావే? ఏంటా నవలా? ఏముంటుంది లేచిపోయిన ఆడది - ఉరేసుకున్నమొగాడు - పెళ్ళానికి విడాకులు - ప్రేయసికి మూడు ముళ్ళు - ఇవ్వేగా నువ్వు చదివేది. అయినా అస్సలు వాటిల్లో ఏముంది? ఈ కాలం వస్తున్న నవల్లన్ని చెత్తవే! అవి చదివే ఈ సమాజం ఇలా చెడిపోతున్నది. ఏవో నాలుగు డబ్బులొస్తాయని అడ్డమైన వాళ్ళు అడ్డమైన చెత్త రాసి సంఘం పైన విసిరెయ్యడం - ఆ చెత్త సంఘాన్ని చెత్త చేయడం! ఆ నవల్లు బ్యాన్ అయితేకాని దేశం బాగుపడదు." ఆమె విలువైన అభిప్రాయాలకు విస్తుపోయింది భారతి.

"ఇంతకీ నన్ను ఎందుకు పిలిచినట్టు-"విస్సుగ్గా అడిగింది.

"ఏంలేదు- పప్ప నానబోశాను- కాస్త మిక్సీలో వేసి రుబ్బు గారెలు చేయాలి దేవుడికి" చెప్పింది.

"అబ్బా అమ్మా! నాకు ఆవతల బోల్డు పనుంది-రికార్డు రాయాలి- పరీక్షలకు చదువుకోవాలి. నువ్వే చేసుకో."విసురుగా చెప్పి వచ్చేసింది.

అదొక గంట పని.

తన అభిమాన రచయిత 'శ్రీ చక్రం' రాసిన 'వక్రభాష్యం' నవల చాలా సస్పెనులో ఉంది. మంచి రసపట్టులో ఉన్నప్పుడు అమ్మ పిల్చి పని చెబుతుంది. ఆమెకు బొత్తిగా సాహిత్య జ్ఞానం లేదు సరికదా సాహిత్యం రంగు, రుచి, వాసన కూడ తెలియదు. అరపేజీ చదివితే తల నెప్పి వస్తుంది. ఒక పేజీ చదివితే నిద్ర వస్తుంది.

భారతి దృష్టి టీవి పైకి మళ్ళింది. స్టార్‌లో కావునా రకరకాల ప్రకటనలు. ప్రకటనల్లో సెక్స్! శృంగార తార చెప్పంది సామాన్య మానవుడు ఆ వస్తువును కొనడని అభిప్రాయపడుతున్న ఆ ప్రకటనదారులకు భారతి జోహారులర్పించింది!

కోపం వచ్చి టీవీ బంద్ చేసింది. అప్పటిదాకా పిల్లిలా నసుగుతున్న రేడియో విజృంభించి చెవిలో పడసాగింది. పేరుకు పాటలు - అన్నీ బూతులు. మ్యూజిక్ పేరుతో

తల పగులగొట్టే ప్రయత్నం! బహుశః ఈ మ్యూజిక్ డైరెక్టర్లు పూర్వజన్మలో రాళ్ళుగొట్టేవాళ్ళు అయి ఉంటారు అనుకుంది భారతి.

రేడియోలో ఒకటే గోల. అది వాడండి ఇది వాడండి... అది శ్రేష్ఠం ఇది శ్రేష్ఠం - అంతా మోసపు ప్రకటనలు! పబ్లిసిటీ యిచ్చుకున్న దానిలో సగం కూడ నాణ్యత కాని, న్యాయం కాని ఉండదు. అయినా ప్రభుత్వంచే నడుపబడే రేడియో కాని, టీవీ కాని ప్రకటనలని ఆమోదించి ప్రసారం చేస్తూ ఉంటాయి.

శ్రోతల, ప్రేక్షకుల బ్రైన్ పొల్యూషన్! నో సొల్యూషన్?

భారతి నవల మీద మనసులగ్నం చేసిందో లేదో.... సుడిగాలిలా అశ్విని వచ్చింది. పేరుకు తగ్గట్టుగానే ఉంటుంది. ఆమె నడుస్తూంటే - మాట్లాడుతూంటే - సార్ధక నామధేయురాలు. ఆమెని చూస్తే షేక్స్‌పియర్ షేక్సై పోయి పేరులోనే ఉంది అని ఒప్పుకునేవాడు.

"ఒసే భారతీ! నువ్వు అర్జెంటుగా తయారై నా వెంట గుడికి రావాలి."

"అబ్బా! నాకు తలనెప్పిగా ఉందే నేరాను." నవల మూయడం యిష్టం లేక చెప్పింది.

"అంతేనా! నీ కోసం నేను ఎన్ని సార్లు ఎక్కడెక్కడెకి రాలేదు. ఆఫ్టరాల్ యివ్వాళ నాకోసం గుడికిరాలేవా? నేనేమన్న బడికి రమ్మన్నానా - మడికి రమ్మన్నానా"? వాపోయింది అశ్విని కదం తొక్కుతూ.

అశ్విని మూడ్‌లోకి వెళ్లిపోతే పట్టుకోవడం కష్టం! అందుకనే నాలుక్కరుచుకుని అమ్మతో చెప్పి బయలుదేరింది. ఆమె సణుగుతున్నా వినిపించుకోకుండా.

"ఏం దేవుడు ఇంట్లో లేడా? కేవలం గుళ్ళోనే కూర్చున్నాడా? ఇక్కడ్నించి దండం పెట్టుకుందే చాలదా?"

ఇద్దరూ గబాగబా రోడ్డుమీద పడ్డారు.

"అది కాదే నాకు సమస్య వచ్చి పడింది" అశ్విని చెప్పింది.

"నీకు రాని దెప్పడు తల్లీ -మళ్ళీ ఏం తలనెప్పి?"

"నాకు ఎంత ఆలోచించినా ఏం చెయ్యాలో అర్థం కాలేదు- అందుకే నిన్ను వెతుక్కుంటూ వచ్చాను" అశ్విని హాస్టల్లో ఉండి పి.జీ. చేస్తున్నది.

"అస్సలు విషయం చెప్పలా?"

"ఆఁ! ఎద్దు మొహం వెంకటేసు నాకు లవ్‌లెటరు రాశాడు. నేను లేంది బ్రతకలేడట! నేను ఒకే అంటే అది వాడి జీవితానికి మోక్షంట. వెంటనే పెళ్లి చేసుకుంటాడట. నాకోసం వాళ్ళ తల్లిదండ్రులనైనా ఎదిరిస్తాడట! వీలైనంత తొందరలో నా అనుమతి కావాలట!" చెప్పింది... బిర్లామందిరంలోకి దారి తీస్తూ.

లాన్సులో కూర్చున్నారు ఇద్దరూ. వెంటనే ఎద్దు మొహం వెంకటేసు రాసిన లెటరు అందించింది చదవమని.

భారతి కష్టపడి చదివింది. అతనికి తెలుగు రాదు- ఇంగ్లీషు రాదు. ఒక్క వాక్యం కూడ ఏ భాషలోనూ స్పష్టంగా రాయలేకపోతున్నాడు. అక్షరాలు గజిబిజిగా ఉన్నాయి. అక్కడక్కడ అక్షరాలు చెదిరిపోయాయి. బాష్పాలు-ఆనందబాష్పాలు రాల్చి ఉంటాడు రాస్తూ.

"భారతీ! వీడిలా రాస్తాడని నేను అనుకోలేదు. నన్ను అప్పడప్పడు కన్నార్పకుండా చూడ్డం గమనించాను. నాతో అడ్వాన్సు అయిపోతాడనుకోలేదు"! చెప్పింది అశ్విని.

"అశ్వినీ! సరే అది పక్కన పెట్టు - వెంకటేసు అంటే నీకున్న అభిప్రాయం ఏమిటి? నువ్వు అతన్ని పెళ్లి చేసుకుంటావా?"

"పెళ్ళా! వాడితోనా? నెత్తిమీద రూపాయి పెడితే పావలాకు కూడ అమ్ముడు పోడు- వాడితో పెళ్ళా?"

"ఆగాగు! తొందర పడద్దు. మీకులంలో కట్నాలు ఆకాశాన్ని అంటుతున్నాయి.అతనికి కనీసం నాలుగులక్షలు యిస్తారు పి.జీ. అయిందనిపించుకుంటే! మరి అతను నాలుగులక్షలు పైకి అమ్ముడు పోగల్డా!" లాపాయింటు తీసింది భారతి.

"నిజమేనోయ్ బారు! కాని కట్నం తక్కువని, లేదని- గుడ్డిగుర్రాన్ని తెచ్చుకుంటే యింట్లోకుండలన్నీ పగులకొట్టినట్లు - నా జీవితం నాశనం కాదా?"

"అది నిజమే! వాడు లైఫ్‌లో పైకి రాలేడు మఫ్!"

"నీకెలా తెల్సు?"

"నీకు లెటరు రాశాడంటేనే అర్థమవుతున్నది."

"నా కంటే అధికుడు నాకు భర్తగా లభించాలి కాని-తక్కువవాడు కాదు. సో వెంకటేసుకు బుద్ధి ఎలా చెబుదాం."

"అక్కరలేదు ఈసారి కన్పిస్తే చెప్పచూపించు అది చాలు! అయినా చదువు కోసం వచ్చినోళ్లకి ప్రేమలేంటట- మెంటల్ పొల్యూషన్ కాకపోతే!" విసుక్కుంది భారతి.

అశ్విని , భారతి గుడి నుంచి బైటకొచ్చి రోడ్డు క్రాస్ చేయబోతూంటే ఎవడో పోకిరీవాడు సైకిలు మీద అశ్వినిని రాచుకుంటూ వెళ్లిపోయాడు.

'బొయ్' మని ఒక మోటారు కారు పొగని మునిసిపాలిటీ వారి దోమలమందు కొట్టేవ్యాన్‌లా విరజిమ్ముకుంటూ వెళ్లిపోయింది. పెట్రోలు కంపుతో రోడ్డు నిండి పోయింది. భారతి ముక్కుమూసుకుంది.

"ఛీ ఛీ! ఎన్ విరాన్ మెంటల్ పొల్యూషన్!"

ఈ లోగానే ఓ బస్సు ఆపకుండా హారన్ యిస్తూ వెళ్లిపోయింది.

"అబ్బబ్బ! సౌండ్ పొల్యూషన్!" చెవిమూసుకుంది.

నాలుగడుగులు వేసారో లేదో...

"పాపులను రక్షించుటకై యేసు ప్రభువు ఈ భూమి పైన అవతరించినాడు- పాపులందరూ తమ తప్పలను ఒప్పుకుని ఆ దేవదేవుని ప్రార్థించినచో ఆయన కరుణించును- ఓ పాపాత్ములారా..." ఓ క్రిష్టియన్ మిషనరీ మైకులో చెప్పుకుంటూ వెళుతున్నాడు. అతని వెనుక ఓ గుంపు కరపత్రాలు- పుస్తకాలు పంచి పెడుతూ వెళుతున్నది.

ఓ కుర్రాడు భారతికి ఓ పుస్తకం ఇవ్వబోయాడు.

"నా కొద్దు-" చెప్పింది.

"డబ్బులివ్వద్దు-ఫ్రీగా తీసుకుని చదవండి."చెప్పాడు అతడు.

"నేను చదవను-నేను హిందువును" చెప్పింది.

"అందుకే మీకిస్తున్నది- మా దేవుడి గొప్పతనం మీకు తెలుస్తుంది ఇది చదివితే!"

అశ్విని, అతనితో వాదన ఎందుకని ఆ పుస్తకం అందుకుంది. కాని భారతి ఊరుకోలేదు.

"సరే! నేను మీకు మా భగవద్గీత యిస్తాను. చదివి చెప్పండి." చెప్పింది-బ్యాగ్‌లోకి చెయ్యిపెట్టి.

అతను భయంగా చూశాడు ఆమె వంక.

"సారీ! మా వాళ్ళు వెళ్ళిపోతున్నారు." అని అతను వెనక్కి తిరిగి చూడకుండా పరుగెత్తాడు.

"మంచివో - పిచ్చివో - ఎవరి నమ్మకాలు వాళ్ళకుంటాయి. వాటిని వమ్ముచేసి తమ నమ్మకాల్ని రుద్దాలని చూస్తారు ఎంతోమంది. " భారతి చెప్పింది.

ఓ పెద్ద రాజకీయ ఊరేగింపు వచ్చింది. కిక్కిరిసిన వాహనాలు - జనం బారులు తీర్చిపోతున్నారు.

మైకులో ఫలానా పార్టీకే - ఫలానా వారికే మీ ఓటు అని గొంతు చించుకుని అరుస్తూ పోతున్నారు.

"సౌండ్ పొల్యూషన్!" "పొలిటికల్ పొల్యూషన్ !" విసుగ్గా అంది భారతి.

"జీవితమే ఒక పెద్ద పొల్యూషన్!" అశ్విని ఇంకా విసుగ్గా అంది.

భారతి ఇంటికొచ్చేసరికి వీధి కొళాయి దగ్గర గలాటా జరుగుతున్నది నీళ్ళకోసం.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని గొప్పలు చెప్పుకునే నేతలు కనీసం మనిషికి సరిపోయినంత తాగునీటిని కూడ అందించలేకపోతున్నారు. నీటిని కూడ స్వయం సమృద్ధిగా పంపిణీ చేయలేని నేతలు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడగటానికి వస్తారో! ఈ పిచ్చి ప్రజలెందుకు ఓట్లేసి గెలిపిస్తారో భారతికి అర్థం కాలేదు.

ఇంటిలో తండ్రి శివశంకరం ఎదురుచూస్తున్నాడు ఆమె కోసం.

"అదృష్టవంతురాలివి భారతి! నీకు అన్ని విధాల తగిన సంబంధం వచ్చింది. చదువు అయిపోగానే పెళ్ళి చేసేసుకోవచ్చు." గుండెలమీద కుంపటి దించినంత ఆనందంగా చెప్పారు.

"నా పెళ్ళికేం తొందర నాన్నా!" విస్తుపోతూ అంది.

"వాళ్ళంతట వాళ్ళు వెతుక్కుంటూ వచ్చారు. సంబంధాలు మనకు కావలసినప్పుడు దొరకవమ్మా! దొరికినప్పుడు చేసుకోవాలి. స్టేట్ గవర్నమెంట్ ఆఫీసర్! మనవాళ్ళే! ఇంకేం కావాలి?" శివశంకరం తేలిగ్గా తీసేశారు.

"అంతేనా! పెళ్ళికి అర్హతలు అంతేనా!?" విస్తుపోతూ అడిగింది భారతి.

"నీ మొహం! అంతగాక? ఇంకేం కావాలి! అతను ఒక మొగాడు. నీకు పెళ్ళి కావాలి. ఆడది ఎప్పటికైనా పెళ్ళి చేసుకోవలసిందే. పుట్టినిల్లు వదిలిపోవలసిందే! ఇది సంఘరీతి - న్యాయం!" తల్లి చెప్పింది.

"అమ్మా! నాకూ ఓ ఇష్టం ఉంటుంది. మొగుడంటే ఇలా ఉండాలని ఊహ ఉంటుంది. నాకు కొన్ని అభిరుచులుంటాయి." భారతి భారంగా అంది.

"నీ మొహం - నీకేం తెల్సు! నీ కంటే మీ నాన్నకే నీ బాగు ఎక్కువగా తెల్సు? తెల్సా?" తల్లి అంది.

"కాని నేను మేజర్ని - ఇరవయ్యేళ్ళదాన్ని - ఆఖరికి ఓటువేసి ఈ దేశానికి కావలసిన నేతను ఎన్నుకునే హక్కున్నదాన్ని - నా మొగుడుని ఎంచుకునే హక్కు నాకు లేదా?" రోషంగా అంది.

"భారూ! మన సమాజంలో హక్కుల ప్రశ్న రాదు - బాధ్యతల బరువే ముందుంటుంది భారూ! చవుక బారు సాహిత్యాన్ని చదివి చవుకబారుగా ఆలోచించమాకు. ఆరున్నర అడుగుల అందగాడు - అందమైన పొడుగాటి కార్లో వచ్చి కాని కట్నం లేకుండా నిన్ను

ఎగరేసుకుపోతాడని - నీ కనుసైగల్లో మెసలుతాడని పిచ్చి పిచ్చి ఆలోచనల్లు చేయమాకు. కలలకు జీవితానికి చాలా తేడా ఉంటుంది."భారతి తల్లి చెప్పింది కటువుగా.

"చూడు తల్లీ - నాకు చేతనైన సంబంధం - మన అదృష్టం కొద్దీ ముంగిట వాలుతున్నది. ఇష్టపడితే నాకు నీకు మేలు చేసినదానివవుతావు. లేదా ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు?" శివశంకరం చెప్పి గదిలోకి వెళ్ళి తలుపులేసుకున్నారు.

భారతి గుండె బరువు ఎక్కింది.

అన్నం తినకుండా తన గదిలోకి పోయి తలుపేసుకుని పడుకుంది.

మెంటల్ పొల్యూషన్! ఎవరికి తోచింది వారు ఇతరుల మీద రుద్దడానికి ప్రయత్నిస్తున్నారు. ఎంతసేపటికి నేను చెప్పింది నువ్వు విను - అనే - మనుషులేకాని - నువ్వు చెప్పింది నేను వింటాను అని చెప్పే మనుషులు లేనే లేరు.

రాజ్యాంగం ఎన్నో స్వాతంత్ర్యాలను ఇచ్చింది. కాగితం మీద.

కాని నిజంగా ఆ స్వాతంత్ర్యాలను పొందుతున్నది ఎవరు? ఎవరో అదృష్టవంతులు - పిచ్చివాళ్ళు తప్పితే!

తన భావి జీవితాన్ని నిర్దేశించే పెళ్ళికి తన అనుమతి అక్కరలేదు - తన ఇష్టాయిష్టాలు అక్కరలేదు. తను నిమిత్తమాత్రురాలు! ఎవడితో తాళి కట్టించుకోమంటే వాడితో గొర్రెలా మెడవంచి తాళి కట్టించుకోవాలి! అదీ మన సంస్కృతి!

ఆడది ఒక బానిస!

బాల్యంలో తల్లిదండ్రులకు బానిస!పెళ్ళయింతర్వాత భర్తకేకాకుండా పిల్లలకూ బానిస!

వ్యక్తి స్వాతంత్ర్యం, వాక్ స్వాతంత్ర్యం, భావ స్వాతంత్ర్యం, ఆర్థిక స్వాతంత్ర్యం, వివాహ స్వాతంత్ర్యం, విద్యా స్వాతంత్ర్యం, సామాజిక స్వాతంత్ర్యం లేని ఓ బానిస ఈ స్త్రీ!

ఆమె కళ్ళ ముందు అందమైన కుర్రాళ్ళు కదలాడుతున్నారు. కాలేజీలో ఎంతమంది అందగాళ్ళు లేరు!?

మరునాడు ఆమె సమ్మతి లేకుండానే పెళ్ళిచూపులు జరిగాయి. పెళ్ళికొడుకు కోతిలాగున్నాడు. తన చేష్టల ద్వారా అంగీకారం తెలిపి వెళ్ళిపోయాడు.

"నాకు నచ్చలేదు - నేను చేసుకోను - నేనెక్కడ - ఆ కోతి ఎక్కడ?" విసురుగా చెప్పింది భారతి.

"అందం కొరుక్కుతింటామా? అయినా మగాడికి అందంతో పనిలేదు. అతని సంపాదనతోనే పని! అతనో ఆఫీసర్! నా కళ్ళతో చూడు మన్మధుడులాగా కనిపిస్తాడు. కట్నం కూడ ఎక్కువ ఆశించడంలేదు." తండ్రి ఆవేదనతో చెప్పాడు.

"చూడమ్మా! అందం అన్నది పెళ్ళయింతర్వాత ఎవరూ పట్టించుకోరు. అతని మనసు - మంచితనం చూడు. అసలు ఆ నవల్లు ఇంట్లోకి తేనివ్వడమే మేం చేసిన తప్పు." తల్లి వాపోయింది.

తర్వాత అశ్విన్ని సలహా అడిగింది.

"ఓ! యస్! చేసేసుకో! నీకు నచ్చిన వాడికి నువ్వు నచ్చుతావని గ్యారంటీ లేదు. నువ్వు నచ్చినా - నీ బ్యాక్ గ్రౌండ్ నచ్చకపోవచ్చు." అశ్విని ఓపిగ్గా చెప్పింది.

గంటల తరబడి ఆలోచన చేశారు ఇద్దరూ!

"అయినా మధ్య తరగతి మనుషులకు మనసేంటి? అవకాశం దొరికితే అందుకోవడమే! మనసు మైనం ముద్దలాంటిది - అవసరం కొద్దీ దాన్ని మలచుకోవచ్చు." అశ్విని సలహా యిచ్చింది ఆరిందాలా!

రోజులు గడుస్తున్నాయి.

భారతి మైండ్ పొల్యూట్ అయిపోయింది. ఎవర్ని కదిలించినా కన్ను మూసుకుని చేసుకోమనేవాళ్లే! పైగా అశ్విని హఠాత్తుగా ఎద్దుమొహం వెంకటేశును చేసుకుని అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది.

ఇంట్లో ఒత్తిడి ఎక్కువకాసాగింది.

"ఈ సమాజంలో ఫ్రీ మైండ్ బ్రతకలేదు. అది ఎవరో ఒకరి కాలుష్యంతో పాడు కాక తప్పదు. కాబట్టి పొల్యూషన్ మేరేజికి నేను రెడీ." భారతి తల్లితో చెప్పింది జీరగొంతుకతో.

అనసూయమ్మ నిర్ఘాంతపోయింది కూతురి స్టేట్‌మెంట్‌కు. భారతి మొహం తిప్పుకుని ఫ్రిజ్ ఓపెన్ చేసి చల్లటి మంచి నీళ్ళు గడగడ తాగుతున్నది. అంత చల్లటి ఫ్రిజ్ వాతావరణ కాలుష్యానికి ప్రతినిధి!

"అమ్మా! భారతి! మనిషి పుట్టేది కాలుష్యంలో! పెరిగేది కాలుష్యంలో! చచ్చేది కాలుష్యంలో! అతను తినే తిండిలో రసాయనాలు - ఎరువులు - అని రకరకాల కాలుష్యాలు వాడుతున్నారు. అతను చదువుకునే చదువులో ఎవరి దృక్పథాలు వాళ్ళు గుప్పిస్తున్నారు. ఇంక కాలేజీ చదువులు మరీ పొల్యూటెడ్! కులాలుగా, మతాలుగా విడిపోవడమే కాకుండా - యవ్వన మదంతో వెర్రిపోకడలు పోయి జీవితాన్నే పొల్యూట్ చేసుకుంటున్నారు యువత! ఇంత పొల్యూషన్‌లో బ్రతుకుతూ నువ్వు పొల్యూటెడ్ మ్యారేజ్ చేసుకున్న తప్పులేదమ్మా!" చెప్పింది అనసూయమ్మ.

"నిజమే! ఎందుకంటే మీక్కావల్సింది వీలైనంత తొందరగా ఆడపిల్లను ఇంట్లోంచి బయటకు గెంటెయ్యడం. ఆ బయట ఏమవుతుందో ఎవరికీ తెలీదు - కిరసనాయిలు డబ్బాకు ఎరకావచ్చు, గ్యాస్ పొయ్యికి బలికావచ్చు, ఫ్యానుకు వేలాడొచ్చు" కళ్ళల్లో నీళ్ళు నింపుకుని చెప్పింది భారతి.

"పిచ్చిదానా! నీ ఫ్రెండు అశ్వినే నీ కంటే తెలివిగలది! కామ్‌గా కట్టేసుకుంది మొగుడ్ని. నాలుగు లక్షలు వెనకేసుకుంది - దాంతో అతన్ని కోతిలా ఆడిస్తుంది జీవితమంతా. గొంగళిలో అన్నం తింటూ వెంట్రుకలు వచ్చాయని విసుక్కోవడం అవివేకం! నీ అభిమాన రచయిత శ్రీ చక్రంను అడిగినా ఇది మంచి సంబంధం అని చెబుతాడు. కాకపోతే కట్టుకున్న గాలిమేడల్లోంచి బయటికొచ్చి వాస్తవంలోకి చూడ్డం అందరికీ చేతకాదు! స్త్రీకి స్వంత వ్యక్తిత్వం ఉండకూడదు - అప్పడే సుఖపడుతుంది. ఆమె కళ్ళు ఒత్తుకుంటూ చెప్పింది కూతురిని ఓదారుస్తూ.

( - ఆంధ్రప్రభ - )

